
సాక్షి
పల్నాడు
మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.8,000, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 506.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,598, ఎస్ ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నేడు చెన్నుని కల్యాణం



మాచర్ల: పట్టణంలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం కల్యాణం నిర్వహించనున్నారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు జరుపుతారు.

న్యూస్‌రీల్

నేడు పేరంటాళ్లమ్మ కల్యాణం, తిరునాళ్లు



వల్లభాపురం(కొల్లిపర): మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలో గల శ్రీ సర్విరెడ్డి పేరంటాలమ్మ దేవస్థానంలో మంగళవారం ఉదయం కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం శిడిమాను ఉత్సవం , తిరునాళ్ల ఉంటాయని పేర్కొన్నారు. భక్తులంతా అమ్మవారిని సందర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకోవాలని సభ్యులు కోరారు.

25న ఏపీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష

చిలకలూరిపేట టౌన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాలల్లో 5,6,7,8వ తరగతుల ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు రాజాపేట ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సుబ్రహ్మణ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి ఏపీఆర్ఎస్ క్యాట్ -2024 పేరిటా నిర్వహించే ఈ ప్రవేశ పరీక్ష జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షకు అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. హాల్ టికెట్లను విద్యార్థిలకు పంపమని, httr://aprr.apcfrr.in అనే విద్యాలయ ప్రత్యేక వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఐడీ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

యార్డుకు 95,448 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 95,448 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 93,891 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 60,589 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

టీడీపీ ప్రచారంలో రేషన్ డీలరు



బెల్లంకొండ: తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారంలో మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రేషన్ డీలరు శనగల సాంబశివారెడ్డి పాల్గొన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సోమవారం మండలం ప్రచారం నిర్వహించారు. సాంబశివారెడ్డి టీడీపీ టీషర్ట్, కండువా ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నాడు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ కార్యక్రమాలలో పాల్గొనడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతనిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నంది వాహనంపై దుర్గా మల్లేశ్వరస్వామి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆది దంపతులకు సోమవారం నంది వాహనంపై నగరోత్సవ సేవ నిర్వహించారు. నాలుగోరోజు ఆలయం వద్ద పలు వైదిక కార్యక్రమాలను అర్చకులు చేశారు. సాయంత్రం మహా మండపం వద్ద నంది వాహనంపై కొలువు తీరిన దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి, ఇతర అర్చకులు పూజలు నిర్వహించగా ఆలయ ఈవో కేఎస్ రామరావు కొబ్బరికాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య ఊరేగింపు కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, శ్రీనివాస మహల్, కోమలవిలాస్, సామారంగం చౌక్, మెయిన్‌రోడ్డు, ఐరన్ సెంటర్, రథం మీదగా తిరిగి మహా మండపానికి చేరింది. దేవస్థానానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

అట్టహాసం.. కోలాహలం

- మాచర్ల, వినుకొండ, పెదకూరపాడు, చిలకలూరిపేటల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల నామినేషన్
- తరలివచ్చిన జనం
- తీన్మార్, సంప్రదాయ నృత్యాలతో సందడి
- కార్యక్రమానికి హాజరైన పార్టీ ప్రముఖులు

జిల్లాలోని నాలుగు నియోజక వర్గాలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వినుకొండలో బొల్లా బ్రహ్మనాయుడు, పెదకూరపాడులో నంబూరు శంకరరావు, చిలకలూరిపేటలో కావటి మనోహర్ నాయుడులు నామినేషన్లను దాఖలు చేశారు. కార్యక్రమానికి జనం పెద్ద ఎత్తున తరలి వచ్చారు.



పిన్నెల్లి నామినేషన్ కార్యక్రమానికి హాజరైన జనసందోహం

మహా సంద్రంగా మాచర్ల

మాచర్ల రూరల్: మాచర్ల మహాసంద్రంగా మారింది. మండుటెండను లెక్కచేయక నియోజకవర్గ పరిధిలోని గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. పట్టణంలోని వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెండవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాం ప్రసాద్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. పిన్నెల్లి వెంట సోదరి జవ్వాజి నాగమణి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి మరుమాముల శ్రీనివాసశర్మ, సీనియర్ న్యాయవాది చిలంకూరి నాగిరెడ్డి, మారం వెంకటేశ్వరరావు (లడ్డూ)లు ఉన్నారు.



నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాం ప్రసాద్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ఆలయాల్లో పూజలు

పీఆర్కే నామినేషన్ దాఖలు

మాచర్ల: ఉదయం రింగురోడ్డులోని ఆంజనేయ స్వామి దేవాలయంలో పీఆర్కే ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు మూడు గంటల సేపు దేవాలయం వద్ద వేచి ఉండి వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డిలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తరువాత దేవాలయం నుంచి వేలాది మంది పీఆర్కే వెంట సాగారు. రింగురోడ్డు నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా మహిళలు, రైతులు, యువకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేరింతలు కొడుతూ బారులు తీరారు. పార్కు సెంటర్‌కు చేరుకునే ముందు అతిథులందరికీ భారీ క్రేన్‌లతో గజమాలలు వేసి సత్కరించారు. వేలాది మందితో పట్టణమంతా కిక్కిరిసిపోయింది. ఎటుచూసిన వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కనబడింది. కార్యక్రమంలో అన్నీ మండలాల ప్రజాప్రతినిధులు, మార్కెట్ యార్డు చైర్మన్‌లు, మాజీ చైర్మన్‌లు, రాష్ట్ర డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

వినుకొండలో జన ప్రవాహం



క్రేన్‌ల సాయంతో బొల్లాకు స్వాగతమాలలు



వినుకొండ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు

వైఎస్సార్ సీపీ అభ్యర్థి బొల్లా నామినేషన్

వినుకొండ(నూజెండ్ల): వినుకొండకు జన ప్రవాహం తరలి వచ్చింది. వినుకొండ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నామినేషన్ సందర్భంగా 50 వేల మందికి పైగా అభిమానులు, కార్యకర్తలు తరలిరావడంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లు కిక్కిరిసిపోయాయి. బొల్లా బ్రహ్మనాయుడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ యర్రం వెంకటేశ్వరరెడ్డి, యువ నాయకుడు గిరిబాబులతో కలసి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి వరదా సుబ్బారావుకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. తొలుత గుంటి ఆంజనేయ స్వామి దేవాలయం, పెద్దమసీదు, ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం కారంపూడి రోడ్డులోని బొల్లా కన్వెన్షన్ హాల్ వద్ద నుంచి కుటుంబసభ్యులు బొల్లా ఆదిలక్ష్మి, గిరిబాబులతో కలిసి ర్యాలీగా బయలుదేరి నామినేషన్ దాఖలు చేశారు.

భారీ ర్యాలీ

బొల్లా కన్వెన్షన్ హాల్ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగింది. కర్ణాటక కళాకారుల ప్రత్యేక నృత్యాలు, డీజే సౌండ్‌ల హోరు మధ్య ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. ఈపూరు, బొల్లాపల్లి, శావల్యాపురం, నూజెండ్ల, వినుకొండ రూరల్, వినుకొండ టౌన్ నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడం విశేషం. రహదారి పొడవున బిల్డింగ్‌లపై నుంచి ప్రజలు అభివాదం చేస్తూ ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. ప్రధాన సెంటర్లలో మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీసి శుభాకాంక్షలు తెలియజేశారు. ర్యాలీ శివయ్య స్థూపం సెంటర్ వద్దకు రాగానే నాలుగువైపులా రహదారులు ఇసుకేస్తే రాలనంతగా జనం ఎండను సైతం లెక్క చేయకుండా మధ్యాహ్న సమయంలో కూడా కిక్కిరిసిపోయారు. శివయ్య స్థూపం సెంటర్‌లో 10 భారీ క్రేన్‌లతో భారీ గజమాలలు ఎమ్మెల్యేకు వేసి అభిమానులు ప్రత్యేక అభిమానం చాటుకున్నారు.

కార్యకర్తల త్యాగాలను మరువలేను

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ కార్యకర్తలు చూపిన అభిమానం, ఆదరణ, వారి త్యాగాలను మరువలేనిదన్నారు. మండుటెండలో సైతం తనపై ప్రేమ, అభిమానాలు చూపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని, టీడీపీ నాయకులు బెదిరింపులకు భయపడమని అన్నారు. కార్యకర్తల కష్టం ఊరికే పోదని, మరలా మనమే అధికారంలోకి వస్తామని అన్నారు. వినుకొండ అభివృద్ధికి టీడీపీ నాయకులు అడ్డుపడుతున్నారని అన్నారు. లక్ష మంది ప్రజలకు తాగునీరు ఇవ్వాలని నేను సంకల్పిస్తే, సింగరచెరువుకు నీరు రాకుండా అడ్డుకోవడం టీడీపీ వారికే చెల్లిందని అన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టు తమ హయాంలోనే పూర్తిచేస్తామన్నారు. టీడీపీ నాయకులు గ్రామాల్లో అలజడులు సృష్టించాలని చూస్తున్నారని, ఎవరూ భయపడవద్దని తమ ప్రాణాలైనా అడ్డువేసి కాపాడతానని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయసహకారాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.

పెదకూరపాడులో జనజాతర



జనసంద్రమైన కాలచక్ర రహదారి



పెదకూరపాడులో నామినేషన్ పత్రాలను అందిస్తున్న నంబూరు శంకరరావు

వైఎస్సార్ సీపీ అభ్యర్థి నంబూరు నామినేషన్

పెదకూరపాడు: వైఎస్సార్ సీపీ పెదకూరపాడు అసెంబ్లీ అభ్యర్థి నంబూరు శంకరరావు నామినేషన్ జన జాతరను తలపించింది. మండుటెండనూ లెక్క చేయకుండా వృద్ధులు, మహిళలు, చిన్నారులు, యువకులు తరలివచ్చారు. కాలచక్ర రోడ్డు జన సంద్రమైంది. తొలుత తన ఇంటి నుంచి ఉదయం 8 గంటలకు శంకరరావు బయలుదేరారు. శంకరరావుకు భార్య వసతంకుమారి, కుటుంబ సభ్యులు గుమ్మడి కాయలతో హారతి పట్టి విజయతిలకం దిద్దారు. ఆయన కుటుంబ సభ్యులతో కలసి తుళ్లూరు మండలం పెద్ద పరిమిలోని తమ ఇష్టదైవమైన సాయిబాబా, ఆంజనేయస్వామిలకు పూజలు నిర్వహించారు. చర్చికి వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం అభిమానులతో కలసి అమరావతి మండలం 14వ మైలు వద్దకు చేరుకుని అక్కడ నుంచి ర్యాలీగా అమరావతి, 75త్యాళ్లూరు మీదగా పెదకూరపాడులోని ఆర్వో కార్యాలయానికి చేరుకొని ఆర్వో కందుల శ్రీరాములుకు నామినేషన్ పత్రాలు అందించారు. అంతకు ముందు శంకరరావు సతీమణి వసంతకుమారి, కుమారుడు కళ్యాణ్ చక్రవర్తిలు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

కాలచక్ర రోడ్డు జనమయం

అమరావతి–పెదకూరపాడు కాలచక్ర రోడ్డు జనంతో నిండిపోయింది. అమరావతి, లింగాపురం, బలుసుపాడు, పరస, 75త్యాళ్లూరు, అబ్బరాజుపాలెం, పెదకూరపాడు గ్రామాల గుండా ర్యాలీ సాగింది. 75త్యాళ్లూరు వద్ద అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు. అమరావతిలోని అంబేడ్కర్ విగ్రహానికి శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

అభివృద్ధి చేసి చూపించా..

గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి చేసి చూపించానని.. అందుకే ధైర్యంగా ఓటు అడుగుతున్నానని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి నంబూరు శంకరరావు అన్నారు. టీడీపీ ఎన్ని కూటములు కట్టినా పెదకూరపాడులో పార్టీ విజయం ఖాయమని పేర్కొన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసే వారికి మద్దతు ఉంటుందనేందుకు నామినేషన్‌కు హాజరైన ప్రజలే సాక్ష్యమని అన్నారు. కృతజ్ఞతలు తెలిపారు.

అత్యధిక మెజార్టీతో గెలుపు తథ్యం

పెదకూరపాడులో ముందే శంకరరావు గెలుపు కనిపిస్తోందని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. క్రోసూరు, సత్తెనపల్లి మార్కెట్ యార్డు చైర్మన్లు ఈదా సాంబిరెడ్డి, పెండెం బాబురావు పాల్గొన్నారు.

ఇది విజయోత్సవ ర్యాలీ

శంకరరావు నామినేషన్‌కు వచ్చిన జనవాహిని చూస్తే ఇది నామినేషన్ పర్వం కాదు, శంకరరావు విజయోత్సవంగా కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు వంగవీటి నరేంద్ర అన్నారు. ఇంత జనాన్ని చూస్తే టీడీపీకి డిపాజిట్లు కూడా వచ్చేలా కనిపించడం లేదన్నారు. అభివృద్ధికి మారుపేరుగా జగనన్న, శంకరన్న నిలిచారన్నారు.పెదకూరపాడులో ఫ్యాన్ ప్రభజనం ఇప్పుడే కనిపిస్తోందన్నారు.

జనసంద్రంగా మారిన పేట



కావటి నామినేషన్ కార్యక్రమానికి హాజరైన జనవాహిని



ఆర్ఓకి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కావటి శివనాగమనోహర నాయుడు

కావటి నామినేషన్ దాఖలు

చిలకలూరిపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావటి శివ నాగ మనోహర్‌నాయుడు నామినేషన్ దాఖలు సందర్భంగా సోమవారం నిర్వహించిన ర్యాలీ చిలకలూరిపేటలో నూతన అధ్యాయనానికి నాంది పలికింది. చిలకలూరిపేట చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా నియోజవర్గం నుంచి తరలి వచ్చిన అభిమానులు, కార్యకర్తలతో కిలోమీటర్ల మేర జనసంద్రంగా మారింది. వైఎస్సార్ సీపీ శ్రేణులు పార్టీ పతాకాలు చేతపట్టి కదం తొక్కారు. పట్టణంలోని బ్యాంకుకాలనీలో ఉన్న పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 9.45 గంటలకు ర్యాలీ ప్రారంభమైంది. ప్రచార రథం పైనుంచి ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పార్టీ నాయకులు విడదల గోపీనాథ్, జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా తదితరులు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. నరసరావుపేట సెంటర్, భాస్కర్ సెంటర్, చౌత్రా సెంటర్, రూరల్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, కళామందిర్‌సెంటర్, గడియార స్తంభం మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకుంది. తీన్మార్ వాయిద్యాల నడుమ కార్యకర్తలు సందడి చేశారు. అడుగడునా భవనాలపై నుంచి మహిళలు, అభిమానులు పూల వర్షం కురిపించారు. మహిళలు ప్రచారరథంపై ఉన్న నాయకులకు గుమ్మడికాయలతో దిష్టి తీసి, హారతులు పట్టి జయం కలగాలని ఆకాంక్షించారు. సుగాలి మహిళలు సంప్రదాయ వస్త్రాలంకరణతో వచ్చి పాటలు పాడి నృత్యం చేశారు. నామినేషన్ ర్యాలీ జైత్రయాత్రలా కొనసాగింది. ముందుగా పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో కావటి మనోహర్‌నాయుడు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌నాయుడుకు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ లాలూపురం రాము, గుంటూరు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు తదితరులు కలసి అభినందనలు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న కావటి మనోహర్ నాయుడు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.నారదమునికి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు టీపీ నాయుడు, బైరా వెంకటకృష్ణ, బొంతు నాగిరెడ్డి, తాళ్ల అంజిరెడ్డి, పఠాన్ తలహాఖాన్, గుత్తా యాములయ్య, ఘంటా శంకర్, మద్దూరి కోటిరెడ్డి, ఏవీఎం సుభాని, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గాదె సుజాత, పార్టీ వివిధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వినుకొండలో నామినేషన్ వేసేందుకు తరలివస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు


మాచర్లలో నామినేషన్ అనంతరం ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే


చిలకలూరిపేటలో నామినేషన్ వేసేందుకు వస్తూ అభివాదం చేస్తున్న కావటి


పెదకూరపాడులో నామినేషన్ వేసేందుకు వస్తూ అభివాదం చేస్తున్న శంకరరావు

కావటి ఆస్తులు-అప్పులు ఇవే

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచిన వివరాలు ఇలా ఉన్నాయి. వయసు 47 సంవత్సరాలు. భార్య పేరు కావటి మాధవి. పిల్లలు చతుర్వేద్, తనీష్ శంకర్. మనోహర్ నాయుడు చేతిలో నగదు రూ. లక్ష, బ్యాంకులో, బాండ్లు, ఇతర స్థిర, చరాస్తుల విలువ రూ. 3,75,64,013, అప్పులు రూ. 60,48,693. భార్య మాధవి చేతిలో నగదు రూ. 50వేలు. బ్యాంకు ఖాతాలు, బంగారం, ఇతర స్థిర, చర ఆస్తుల విలువ రూ. 45,38,949గా పొందుపరిచారు.

మోసగాళ్లను మర్చిపోండి

- సీఎం జగన్‌కు జేజేలు పలకండి
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి
- ప్రభుత్వ విప్ పీఆర్కే, అనిల్‌కుమార్ యాదవ్‌ను భారీ మెజార్టీలతో గెలిపించండి

మాచర్ల: రాష్ట్రంలో పేదలకు, పెత్తందార్లకు యుద్ధం జరుగుతోందని, ఇందులో భాగంగా పేదల వైపు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఉన్నారని, పెత్తందార్లకు కూటమి సపోర్టుగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, వైఎస్సార్ సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నామినేషన్ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసి అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. ఇది రాష్ట్ర చరిత్రలో ఇంత వరకు ప్రజలకు చెప్పింది చేసినట్లు చరిత్ర కలిగిన నాయకుడు ఎవరూ లేరన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి 2019లో అనేక హామీలిచ్చి అంతకన్నా ఎక్కువ పథకాలను ప్రజలకు ఇవ్వటం జరిగిందన్నారు. ఎక్కడా రాజీపడకుండా పేదలకు న్యాయం చేసిన ఘనత సీఎం జగన్‌దే నన్నారు. ప్రతి పేదవానికి మేలు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న సీఎం జగన్‌ని ఎదుర్కొనలేక చంద్రబాబు కుట్రపూరితంగా బీజేపీ, జనసేనతో పొత్తుల పెట్టుకున్నారన్నారు. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ ఏనాడైనా తన ఫోటోను చూపించి ఓట్లు వేయండని అడిగిన చరిత్ర చంద్రబాబుకు లేదన్నారు. ఓ వైపు వెన్నుపోటు పొడిచిన మామ ఫొటో, మరో వైపు జనసేన నేత పవన్‌కళ్యాణ్, బీజేపీ అధినేత మోదీ ఫొటోను అడ్డం పెట్టుకుని ఎన్నికలకు దిగాడన్నారు. ఇప్పటి వరకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని చేసే పేరుతో ఎంతో ముందు చూపుతో వ్యవహరించిన సీఎం జగన్ కావాలా.. పొత్తులతో ప్రజలను మోసగించే చంద్రబాబు కావాలా అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించుకుని రాబోయే రోజుల్లో సీఎం జగన్‌కు మద్దతు పలికి జే జేలు పలకాలన్నారు.

ఓటు ద్వారా కూటమికి బుద్ధి చెప్పాలి

వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో తిరుగులేని నాయకుడుగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. గతంలో అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు వాగ్దానాలను అమలు చేయటంలో నిర్లక్ష్యం వహించారన్నారు. అలాంటి నాయకుడు మళ్ళీ తిరిగి ఉచిత హామీలిస్తూ మోసగించే పనిలో ఉన్నారన్నారు.

మోసగించడం చంద్రబాబు నైజం

ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్‌ని మళ్ళీ సీఎం చేసుకుంటే ఈ రాష్ట్రం సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. హామీలిచ్చి మోసగించటమనేది చంద్రబాబు నైజమన్నారు. ఈ సభలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగ ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు, మార్కెట్ యార్డు చైర్మన్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలుతో పాటు వేలాది మంది జనం పాల్గొన్నారు.

మండాదిలో కలెక్టర్ పల్లెనిద్ర


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లోతేటి

వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్‌లు ఆదివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మండాది ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ బూత్‌లను పరిశీలించి పాఠశాలలో ఏర్పాటు చేసిన గదిలో పల్లె నిద్ర చేశారు. సోమవారం ఉదయం గ్రామంలో తిరిగి ఓటు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వారికి నచ్చిన పార్టీలకే వేసుకోవాలన్నారు. గ్రామంలో ఎలాంటి ఒత్తిడిలు, ప్రలోభాలు పెడితే వెంటనే ఎన్నికల అధికారికి సమాచారమివ్వాలన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని గుండ్లపాడులో ఉన్న నాలుగు పోలింగ్ బూత్‌లను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని పలు ఓటర్లతో మాట్లాడారు. గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీహరిని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలలో బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు.

జెండా ఎగురవేస్తాం.. జగనన్నకు కానుకగా ఇస్తాం

- చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి కావటి శివనాగ మనోహర నాయుడు

చిలకలూరిపేట: ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించి, నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు కానుకగా ఇస్తామని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. సోమవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కనీవిని ఎరుగని స్థాయిలో అభివృద్ధి, సంక్షేమం అందించిన ముఖ్యమంత్రి జగన్ తిరిగి అధికారం సాధించాలని ప్రజలు ప్రతినబూనారని చెప్పారు. దీనికి ప్రజల నుంచి లభిస్తున్న అపూర్వ ఆదరణే నిదర్శమన్నారు. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుంటే ప్రతి గడపలోనూ ప్రజలు సీఎం వైఎస్ జగన్ తమను ఎన్నో రకాలుగా ఆదుకున్నారని తెలుపుతున్నారని వెల్లడించారు. గత ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసిన వారు సైతం మాకు ఇళ్ల పట్టాలు వచ్చాయి... ఆరోగ్యశ్రీ ద్వారా మేలు జరిగింది... ఎన్నో పథకాలు అందుతున్నాయి, ఈసారి వైఎస్సార్ సీపీకే ఓటు వేస్తాం అని చెబుతున్నారని పేర్కొన్నారు.

బెదిరింపులు సహించం...

కొంతమంది టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉందని, అలాంటి వారికి తగు రీతిలో గుణపాఠం చెబుతామని కావటి హెచ్చరించారు. టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు మాటలు నమ్మి దౌర్జన్యాలకు దిగితే తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదన్నారు. దీని కి నిదర్శనం 2019లో ఓటమి చెందాక ప్రత్తిపాటి పుల్లారావు నియోజకవర్గానికి నాలుగున్నర సంవత్సరాలు దూరంగా ఉన్న విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. 2019 తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను సైతం గాలికి వదిలేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పుల్లారావు, ఆయన సతీమణి చేసిన అరాచకాలు, అవినీతి నియోజక వర్గ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. గుడ్డిపత్తి అమ్ముకొనేందుకు ప్రకాశం జిల్లా బొబ్బేపల్లి నుంచి వచ్చిన ప్రత్తిపాటి ఇక్కడి ప్రజల నెత్తిన టోపీ పెట్టి గతంలో ఎమ్మెల్యేగా గెలిచారని, టీడీపీ ఓడిపోవడం ఖాయమని, ఆ తర్వాత పుల్లారావు కనిపించే పరిస్థితి ఉండదని, ఆయనను నమ్ముకుంటే నట్టేట మునగడం ఖాయమన్న విషయం ఆ పార్టీ నాయకులకు కూడా తెలుసన్నారు. అయినప్పటికీ బెదిరింపులకు దిగడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు.

తీరని రోదన

వేటపాలెం: ఎదురుగా వేగంగా వచ్చిన లారీ స్కూటీని ఢీ కొట్టిన ఘటనలో అమ్మమ్మ, మనుమరాలు మృతి చెందారు. ఈ ఘటన చీరాల – వేటపాలెం బైపాస్ రోడ్డులో అక్కాయిపాలెం ఐస్ ఫ్యాక్టరీ దగ్గరలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చిన్నగంజాం మండలం కొత్త పాలేనికి చెందిన స్నేహలత తన ఏడాది కూతురు అన్విత, తల్లి బొడ్డు సుబ్బరావమ్మ (57)ను స్కూటీ పై ఎక్కించుకొని బాపట్ల అత్తగారింటికి బయలుదేరింది. అక్కాయిపాలెం దగ్గరకు రాగానే ఎదురుగా ఒంగోలు వైపు వెళ్తున్న లారీ వీరిని ఢీ కొట్టింది. స్కూటీ వెనక కూర్చొన్న సుబ్బరావమ్మ, తనఒడిలో ఉన్న ఏడాది పాప లారీ కింద పడ్డారు. దీంతో వీరిద్దరూ అక్కడికక్కడికే మృతి చెందారు. స్నేహలతకు గాయాలయ్యాయి.

నాల్గోరోజు 38 నామినేషన్లు దాఖలు

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసేందుకు నాల్గోరోజు సోమవారం జిల్లా వ్యాప్తంగా 38మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో పార్లమెంటు నియోజకవర్గానికి ఎనిమిది మంది నామినేషన్లు వేయగా, మిగతా 30మంది వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు వేశారు. మొత్తంపై నామినేషన్లు వేసిన వారిలో 11 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, వారి మద్దతుదారులు నామినేషన్లు వేయగా, నలుగురు టీడీపీ తరపున, కాంగ్రెస్ పార్టీ తరపున ముగ్గురు నామినేషన్లు వేశారు. పార్లమెంటు సీటుకు లావు శ్రీకృష్ణదేవరాయలు తరపున ముప్పాళ్ల సాంబశివరావు, లావు మేఘన తరపున పూదోట అర్లయ్య(టీడీపీ), డాక్టర్ గోదా రమేష్ కుమార్ (జాతీయ జనసేన పార్టీ), తోకల నాగరాజు (ఆల్ ఇండియా పార్వార్డ్ బ్లాక్), వేంపాటి వీరాంజనేయరెడ్డి, షేక్ అబ్దుల్ రజాక్ (ఇండిపెండెంట్), పప్పుల సాంబశివరావు (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), సంగం శ్రీకాంతరెడ్డి (బీఎస్‌పీ) నామినేషన్ వేశారు. పెదకూరపాడు అసెంబ్లీకి నంబూరు శంకరరావు, నంబూరు వి.వసంత కుమారి (వైఎస్సార్ సీపీ), పమిడి నాగేశ్వరరావు (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), షేక్ యునాస్ (ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్), నంబూరు కల్యాణ చక్రవర్తి, శెట్టి సింగరయ్య(ఇండిపెండెంట్లు) నామినేషన్లు వేశారు. చిలకలూరిపేట అసెంబ్లీకి కావటి శివనాగ మనోహరనాయుడు (వైఎస్సార్ సీపీ), నల్లపు కోటేశ్వరరావు (బీఎస్‌పీ), రావు సుబ్రమణ్యం (నవతరం), ఒంటారి విజయమ్మ(తెలుగు రాజాధికార సమితి) నామినేషన్లు వేశారు. నరసరావుపేట అసెంబ్లీకి మహమద్ మజూర్‌షేక్ (ఇండిపెండెంట్), గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గోపిరెడ్డి సుస్మితారెడ్డి (వైఎస్సార్‌సీపీ), తల్లపునేని హరికృష్ణ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) నామినేషన్లు వేశారు. సత్తెనపల్లి అసెంబ్లీకి సులమ్ రాజ్యలక్ష్మి(ఇండిపెండెంట్), కన్నా లక్ష్మీనారాయణ (టీడీపీ), అంబటి రాంబాబు తరపున అంబటి విజయలక్ష్మి, యెండూరి ఉపేష్ చంద్రచౌదరి (వైఎస్సార్ సీపీ) నామినేషన్లు వేశారు. వినుకొండ అసెంబ్లీకి బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా గిరిబాబు (వైఎస్సార్ సీపీ), ఉస్తల చినకాశయ్య, షేక్ బాజీ, దాట్ల అంజిరెడ్డి(ఇండిపెండెంట్లు) నామినేషన్లు వేశారు. గురజాల అసెంబ్లీకి కాసు మహేష్‌రెడ్డి(వైఎస్సార్ సీపీ), యరపతినేని శ్రీనివాసరావు (టీడీపీ), నీరుమళ్ల శ్రీనివాసరావు(అఖిల భారతీయ జనసంఘ), పసుపులేటి పిచ్చయ్య (ఇండిపెండెంట్) నామినేషన్లు వేశారు. మాచర్ల అసెంబ్లీకి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (వైఎస్సార్ సీపీ), యర్రమాల రామచంద్రారెడ్డి, యర్రమాల కృష్ణవేణి(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) తరపున నామినేషన్లు దాఖలు చేశారు.

ముగ్గురు యువకుల మృతి

కనపర్రు – సాతులూరు మధ్య సాగర్ కాల్వ వద్ద ఘటన


గేరా పురుషోత్తం


చలమల రాజు


బోరుగడ్డ ఆకాష్

నాదెండ్ల: ఈత సరదా ముగ్గురు మరణాలకు కారణమైంది. ఈ విషాద సంఘటన పల్నాడు జిల్లా కనపర్రు నుంచి సాతులూరు వెళ్లే మార్గమధ్యలో సోమవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. నరసరావుపేట రూరల్ మండలం, ములకలూరు గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు గేరా పురుషోత్తం (20), బోరుగడ్డ ఆకాష్(20), చలమల రాజు (20) ఆదివారం ఉదయం ఎండుగుంపాలెంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. ముగ్గురు ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో సరదాగా ఈత కొట్టేందుకు ఉపక్రమించారు. కాలువ పక్కనే బైక్‌ను నిలిపి చెప్పులు, దుస్తులు, సెల్‌ఫోన్లు గట్టుపై పెట్టి కాలువలోకి దిగారు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ తెల్లవారేసరికి ముగ్గురు శవాలుగా తేలారు. సోమవారం ఉదయం అటుగా వెళ్తున్న ఎండుగుంపాలెం వాసులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలాన్ని చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, నాదెండ్ల ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈతగాళ్లను పిలిపించి మృతదేహాలను వెలికితీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. యువకుల మృతితో ములకలూరు ఎస్సీ కాలనీలో తీవ్ర విషాదం నెలకొంది.

ముగ్గురూ స్నేహితులే...

మృతులు ముగ్గురు స్నేహితులు. వేర్వేరు పనులు చేసుకుని జీవిస్తుంటారు. గేరా పురుషోత్తం ఇటీవల ఇంటర్ పరీక్షలు రాశాడు. తండ్రి రాజేష్ వ్యవసాయకూలి. బోరుగడ్డ ఆకాష్ కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. తండ్రి బాజీ కూలిపనులు చేస్తుంటాడు. చలమల రాజు తెలంగాణలోని నల్గొండ చెక్‌పోస్టు వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

ముగ్గురు మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ముగ్గురు ద్విచక్ర వాహనంపై ఆదివారం ఉదయం ఎండుగుంపాలెంలో జరిగే వేడుకకు వెళ్తున్నామని చెప్పి బయలుదేరారు. రాత్రి అయినా ఇంటికి చేరకపోయేసరికి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై వెతుకులాట ప్రారంభించారు. కాలువలో మృతదేహాలున్నాయన్న సమాచారంతో కుటుంబ సభ్యులు తీరని విషాదంలో మునిగిపోయారు.

టెన్త్ ఫలితాల్లో సత్తాచాటిన సర్కార్ బడులు

- జిల్లాకు 18వ స్థానం
- ఉత్తీర్ణతా శాతం 86.05
- గత ఏడాది కంటే 16.5 శాతం అధికం
- 593 మార్కులు సాధించిన మున్సిపల్ విద్యార్థిని రిషిత రెడ్డి
- సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు: డీఈఓ


విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో సర్కార్ బడులు సత్తా చాటాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించారు. ప్రభుత్వం కల్పించిన వసతులను, పథకాలను సద్వినియోగ పరుచుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. సోమవారం ప్రకటించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో పల్నాడు జిల్లా రాష్ట్రంలో 18వ స్థానంలో నిలిచింది. జిల్లాలోని 433 ఉన్నత పాఠశాలల నుంచి 25,207 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 23,792 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థుల ఉత్తీర్ణత 86.05 శాతంగా ఉంది. గత ఏడాది 69.47 ఉత్తీర్ణత శాతం ఉండగా ఈ ఏడాది గత ఏడాది కంటే మరో 16.5 శాతం అధిక ఉత్తీర్ణత సాధించింది. విద్యా వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులకు ఫలితం కనపడుతున్నది. నూతనంగా జిల్లాలను ఏర్పాటు చేసి ప్రతి జిల్లాకు విద్యాశాఖాధికారిని నియమించటం ద్వారా విద్యార్థులపై విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ పెరిగింది. దీనికి తోడు ప్రభుత్వం విద్యార్థులకు అనేక పథకాలను ప్రవేశ పెట్టి నాణ్యమైన ఆహారం, విద్యను అందించటంతో విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల ఫలితాలలో నరసరావుపేటలోని తిలక్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన గాండ్లపర్తి రిషికరెడ్డి 593 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే పులిపాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన జమ్మిగుంపుల ప్రమీల 590 మార్కులతో ద్వితీయ స్థానం సాధించింది. వేల్పూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.భువనసాయి సుభాష్ 588, వినుకొండ జడ్పీ విద్యార్థిని బత్తుల గాయత్రి వెంకట హిమజ 587 మార్కులు సాధించారు. మున్సిపల్ బాలికోన్నత పాఠశాలకు చెందిన బృంగి లక్ష్మీ నాగశ్రావ్య 582, షేక్.అంజుమ్‌గౌసియా, మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన షేక్.నాసర్‌వలి 579 మార్కులు, ఎస్.వెంకట సహర్ష 557 మార్కులు సాధించారు. మాచర్ల కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం విద్యార్థిని ఎం.భవాని 582 మార్కులు సాధించింది.

చిలకలూరిపేటలోని బాలుర రెసిడెన్షియల్ పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. జిల్లాలోని 14 మోడల్ పాఠశాలల్లో చీకటీగలపాలెం పాఠశాల విద్యార్థులు మర్రెడ్డి భానుప్రసన్న 590, చెరుకుచెర్ల పావని 586, వెంకట నాగలక్ష్మీపూజిత 584మార్కులు సాధించారు.

ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేస్తున్న వివిధ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత వివరాలు ఇలా ఉన్నాయి.

యాజమాన్యం	పాఠశాలల సంఖ్య	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులైన విద్యార్థులు	ఉత్తీర్ణత శాతం
జడ్పీ హైస్కూల్స్	179	10,940	9,917	90.64
మున్సిపల్ స్కూల్స్	05	568	541	95.24
మోడల్ స్కూల్స్	14	1,089	1,066	97.88
కె.జి.బి.వి.	24	857	806	94.04
ప్రభుత్వ	03	237	202	85.23
ఎయిడెడ్	20	748	683	91.31
గిరిజన పాఠశాలలు	12	304	282	92.76
సోషల్ వెల్ఫేర్	10	736	718	97.55
ఏపీ రెసిడెన్షియల్	01	33	33	100
బీసీ వెల్ఫేర్	04	146	141	96.57
ఆశ్రమ	02	80	72	90

ఐఏఎస్ కావడమే లక్ష్యం

వినుకొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానం తనకు ఎంతో దోహదపడిందని, 10వ తరగతి పరీక్షా ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన బత్తుల గాయత్రి వెంకట హిమజ పేర్కొంది. పల్నాడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యనభ్యసించిన గాయత్రి 587 మార్కులు సాధించి, వినుకొండ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరి కంటే అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. రానున్న రోజులలో జెఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరచడమే కాకుండా, సివిల్స్‌లో ప్రతిభ కనబరిచి ఐఏఎస్ కావాలన్నది తన ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. తన ఉత్తీర్ణతకు సహకరించిన తల్లిదండ్రులు నాగేశ్వరరావు, జయశ్రీలకు పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసింది. వినుకొండ రూరల్ నడిగడ్డ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలనందు స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బత్తుల నాగేశ్వరరావు భార్య జయశ్రీలు తమ కుమార్తె ప్రతిభ కనబరిచి, అత్యధిక మార్కులు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తు, చిన్నారి గాయత్రికి స్వీటు తినపించి తమ సంతోషాన్ని పంచుకున్నారు.



కుమార్తెకు తీపి తినిపిస్తున్న తల్లిదండ్రులు నాగేశ్వరరావు, జయశ్రీ

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు

ఉపాధ్యాయుల సహకారం, సమిష్టి కృషితో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాం. రానున్న రోజుల్లో మరింత కృషి చేసి హాజరు శాతం పెంచటంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖాధికారి

పేదింట విద్యా కుసుమం


గాండ్లపర్తి రిషితరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: పేదింట విద్యా కుసుమం విరబూసింది. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో నిరుపేద విద్యార్థిని గాండ్లపర్తి రిషిత రెడ్డి 593 మార్కులతో పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల టాపర్‌గా నిలిచింది. పట్టణంలోని తిలక్ మున్సిపల్ పాఠశాల విద్యార్థిని రిషితరెడ్డి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి అత్యుత్తమ మార్కులు సాధించింది. తండ్రి రంగారెడ్డి చిరు వ్యాపారి. చిన్నచిన్న దుకాణాలకు తినుబండాలను విక్రయిస్తుంటాడు. తల్లి స్వప్న కొబ్బరి మిల్లులో కూలీగా పనిచేస్తుంది. రోజూవారీ వచ్చిన కొద్దిపాటి కూలీ డబ్బుతోనే జీవనాన్ని సాగిస్తూ తమ పిల్లలను చదివిస్తున్నారు. దీనికి తోడు జగనన్న అమ్మఒడి రిషిత చదువుకు ఎంతో ఉపయోగపడుతున్నదని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రిషిత సోదరి బీటెక్ చదువుతోంది. రిషిత చిన్నతనం నుంచి చదువులో ప్రతిభ చాటుతున్నది. తన 8వ తరగతిలో నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై ఏడాదికి రూ.12 వేలు స్కాలర్‌షిప్ సాధించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుంభా శివనరసింహా రావు, ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని స్టడీ అవర్స్ నిర్వహించటంతో పాటు వారికి అవసరమైన బోధనను ఎప్పటికప్పుడు అందించటం విద్యార్థులకు ఉపయోగపడింది. పాఠశాలలో 39 మంది పరీక్షకు హాజరు కాగా 35 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 20 మంది 450కు పైగా మార్కులు సాధించారు.


బి.లక్ష్మీనాగశ్రావ్య


షేక్.అంజుమ్‌గౌసియా


షేక్.మెహత


షేక్.నాసర్‌వలి


ఎస్.వెంకట సహర్ష


ఎం.భవాని